క్లుప్తంగా

జోన్-4 గ్రీవెన్స్‌కు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: సమస్యలు పరిష్కారానికి(రెడ్‌సెల్ సిస్టమ్) గ్రీవెన్స్‌సెల్‌ను కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం జోన్-4 కార్యాలయం లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ నుంచి ఒకటి, రెవెన్యూకు 2, టౌన్ ప్లానింగ్ నుంచి 1 వినతులు వచ్చాయి. ఈసందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా సమస్య పరిష్కారం అయిన వెంటనే రికార్డులో రాసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఝాన్సీ, రెవెన్యూ అధికారులు అప్పలరాజు, తదతరులు పాల్గొన్నారు.

సీనియర్ సహాయకులకు పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీనియర్ సహాయకులు పీఎస్ఎస్ ప్రసన్న, వై.యల్లమ్‌నాయుడుకు పర్యవేక్షకులుగా పదోన్నతి కల్పిస్తూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. విశాఖ నగరాభివృద్ధికి, ప్రజలకు సేవ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సృజనాత్మకంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనల సందడి



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న రమేష్, తదితరులు

అల్లిపురం: శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం నియోజకవర్గంలో అన్నసమారాధనల సందడి నెలకొంది. 33వ వార్డులో గోవింద్‌రోడ్డు శ్రీ దుర్గా దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా 3 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు ఎం.రమేష్ పాల్గొని ప్రారంభించారు. సుమారు 3 వేల మంది పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. జాబ్ డ్రైవ్‌లో తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్ ఇన్నోసోర్స్, ఎస్‌బీఐ కార్డ్స్, డీమార్ట్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయని తెలిపారు. 305 మంది అభ్యర్థులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకున్నారని, వీరిలో 49 మంది ఎంపిక య్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి రమేష్‌నాయుడు జాబ్‌మేళా వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో చాముండేశ్వరరావు, కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ విద్యా కల్పన, డి.ప్రజ్ఞ, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షణ క్షణం... భయం భయం




క్వీన్‌మేరీ పాఠశాల వెనుక శిథిల భవనం



భయంకర వాతావరణంలో పాత రిజిస్ట్రార్ కార్యాలయం

- పాత నగరంలో 100కు పైగా శిథిల భవనాలు
- ఏ క్షణాన కూలిపోతాయోనని ఆందోళన
- తొలగించాలని నోటీసులిచ్చిన జీవీఎంసీ
- అయినా అద్దెలకు ఇచ్చేస్తున్న యజమానులు

దాబాగార్డెన్స్ : శిథిల భవంతులతో పాత నగరవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఏ క్షణంలో కూలిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో పాత భవనాలు ఎప్పుడు, ఎవరిపై కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు పాతనగరం అంబుసరంగు వీధిలో పురాతన ఇల్లు కూలిపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. వర్షాకాలం కావడంతో వందేళ్లకు పైబడి చరిత్ర ఉన్న భవంతుల గోడలు నానిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇవన్నీ పెద్ద భవంతులు కావడం, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉండడంతో ఎప్పుడైనా కూలిపోతే భారీగా ప్రాణనష్టం జరిగే ప్రమాదముంది.



అబుసరంగ్ వీధిలో శిథిలావస్థకు చేరిన ఇల్లు

అద్దెలకిచ్చేస్తున్న యజమానులు

పాతనగరంలో సుమారు 100 వరకూ పాత భవనాలు ఉన్నట్టు గతంలో జీవీఎంసీ అధికారులు లెక్కలు వేశారు. వీరందరికీ ఇళ్లను తొలగించాలని నోటీసులు కూడా జారీ చేశారు. ఇవి ఎంత మాత్రం నివాసయోగ్యం కాదని నిపుణులు చెబుతున్నా యజమానులు మాత్రం డబ్బులకు కక్కుర్తిపడి అద్దెలకు ఇచ్చేస్తున్నారు. ఆ భవనాలు కూలితే భారీగా ప్రాణనష్టం సంభవిస్తుందని పలువురు హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. శిథిల భవనాలను తొలగించాల్సిన జీవీఎంసీ అధికారులు మిన్నకుండిపోతున్నారు. వీటిని తొలగించాలంటే కోట్లాది రూపాయల ఖర్చవుతుందని అంచనా వేశారు. అంత ఖర్చు చేయడం తలకు మించిన భారం కనుక భవన యజమానులు కూడా మిన్నకుండిపోతున్నారు. భవనాల తొలగింపునకు జీవీఎంసీ నోటీసులు జారీ చేస్తున్నా పైరవీలు చేసి యజమానులు తప్పించుకుంటున్నారు.

శిథిల భవనాల్లో పాములు

పాత భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, ఆయా ఇళ్లల్లో ఎవరూ నివసించకపోవడంతో తుప్పలు పేరుకుపోయి పాముల బెడద ఎక్కువైంది. సమీప ఇళ్లల్లోకి పాములు చొరబడుతుండడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. మరోవైపు వందేళ్లకు పైబడిన భవనాలు పాతనగరంలో చాలా ఉన్నాయని, వాటిని తొలగించాలంటే జీవీఎంసీపై ఆర్థిక భారం పడుతుందని అధికారులు చెబుతున్నారు. భవనాల యజమానులే వాటిని తొలగించుకుంటే అవసరమైన సాయం చేస్తామని, పాత భవనాలు అద్దెలకు మాత్రం ఇవ్వొద్దని సూచిస్తున్నారు.

ముగ్గురు నిరాశ్రయులకు ఆశ్రయం

సీతమ్మధార : రామకృష్ణా బీచ్ పరిసరాల్లో తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులకు టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ - ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. వివరాలిలా వున్నాయి. ఎస్.రమేష్ (68), చంద్రమ్మ (60) అనాథలుకాగా ఎన్.భారతి (38)కి కుటుంబమున్నా ఆమె వారితో కలవడం లేదు. గతంలో ఆమెను రెండుసార్లు వసతిగృహం నుంచి ఇంటికి పంపించినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో వీరు ముగ్గురూ ఆర్‌కే బీచ్ ఏరియాలో తిరుగుతుండగా గమనించిన వన్‌టౌన్ సీఐ ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది అక్కడ రెస్క్యూ నిర్వహించి ఆ ముగ్గురినీ ద్వారకానగర్‌లో గల నిరాశ్రయుల వసతిగృహానికి సోమవారం తరలించారు. ఇక్కడ పురుషులు, మహిళలకు వేర్వేరుగా వసతి గృహాలున్నాయి. వీరి వివరాలను ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి ఆరా తీస్తున్నారు.



వసతి పొందిన వారితో ఏయూటీడీ కార్యదర్శి వాసు

అటువంటి కార్యక్రమాలకు బీవీపీకి సంబంధం లేదు

దాబాగార్డెన్స్: భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) రాష్ట్ర కార్యవర్గం అనుమతి లేకుండా వేరే పేరుతో ఎవరైనా కార్యక్రమాలు నిర్వహిస్తే సంస్థ బాధ్యత వహించదని బీవీపీ దక్షిణ ప్రాంత పరిధి ప్రధాన కార్యదర్శి ధూళిపాల పురుషోత్తమ శాస్త్రి ప్రకటనలో పేర్కొన్నారు. భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి, ప్రాంతీయ స్థాయి, విశాఖపట్నం ప్రాంత్ స్థాయిలో ధృవీకరణ పత్రంతో అనుమతి పొంది గత కొన్నేళ్లుగా నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్న శాఖలు, భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, మహిళా సభ్యులతో మాత్రమే ఏర్పాటైన భారత్ వికాస్ పరిషత్ ఝాన్సీ లక్ష్మీభాయి శాఖ సేవా కార్యక్రమాలు చేపడతున్నాయని చెప్పారు. అలా కాకుండా వేరొక పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తే బీవీపీ రాష్ట్ర కార్యవర్గం బాధ్యత వహించదన్నారు. అంతేగాక ఈ విషయమై తగు విచారణ జరిపి నివేదికను రాష్ట్ర కార్యవర్గంతో ప్రాంతీయ కార్యవర్గానికి అందజేయాలని రీజనల్ జాయింట్ జనరల్ సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణను కోరినట్టు పురుషోత్తమ శాస్త్రి తెలిపారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలు రేపు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు బుధవారం నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లోని యూనియన్ బ్యాంకు సమీపంలోని నర్సుల క్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతి ఓటరూ తప్పకుండా గుర్తింపు కార్డుతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డు లేక ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు.

కేజీహెచ్‌లో ఎన్నికల ప్రచారం

ఏపీ ప్రభుత్వ నర్సుల విశాఖ కార్యవర్గం కోసం ఈ నెల 23న ఎన్నికలు నిర్వహిస్తుండడంతో ప్రచారం జోరందుకుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. భవానీ ఒక ప్యానల్‌తో, ఉషారాణి మరో ప్యానల్‌తో పోటీ చేస్తున్నారు. ఈ రెండు ప్యానళ్ల తరఫున అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రచారం చేస్తున్నారు. బి.ఉషారాణి తరఫున అబీబుల్లా ఖాన్ మెమోరియల్ సంఘం ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా రవీంద్రనాథ్ జైతు కూడా ప్రచారం చేస్తున్నారు.



కేజీహెచ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న నర్సులు

టిడ్కో డిపాజిట్ల వాపస్

సీతమ్మధార : టిడ్కో హౌసింగ్ డిపాజిట్ల వాపస్ కోసం ఆశీలమెట్టలో గల జోన్ - 3 కార్యాలయానికి అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు సోమవారం క్యూ కట్టారు. 2018 - 2019లో టిడ్కో ఇళ్ల కోసం జోన్ - 3 పరిధిలో ఉత్తర, తూర్పు నియోజకవర్గాల నుంచి సుమారు రెండు వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో డిపాజిట్ల కింద రూ.6 కోట్లు చెల్లించారు. పలు కారణాల వల్ల ఇళ్లు రానివారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల ముందు రూ.6 లక్షలు వాపస్ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా డిపాజిట్ల వాపస్‌కి బ్రేక్ పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు కొద్ది రోజులుగా టిడ్కో డిపాజిట్లు వాపస్ చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జోన్ - 3కి రూ.75లక్షల నిధులు విడుదల చేసింది. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, డిమాండ్ డ్రాఫ్ట్ జెరాక్స్, ఇతర డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలి. అప్పట్లో దరఖాస్తుదారులు రూ.10 వేలు, రూ.25 వేలు చొప్పున డిపాజిట్లు చెల్లించారు. దరఖాస్తుదారుల వివరాల నమోదు కోసం జోన్ - 3 కార్యాలయానికి సచివాలయాల నుంచి ఇద్దరు వెల్ఫేర్ కార్యదర్శులను కేటాయించారు. వీరు దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారులకు బయోమెట్రిక్ విధానంలో ఫొటోలు తీస్తున్నారు. ఈ సందర్భంగా యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము 'సాక్షి'తో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తుదారులకు మూడు రోజుల్లో డిపాజిట్లు వాపస్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని వివరించారు. దరఖాస్తుదారులు అవసరమైన పత్రాలతో ఆశీలమెట్టలోని జోన్ - 3 కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



డిపాజిట్ల వాపస్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

బడి, గుడి దగ్గరలో మద్యం షాపులొద్దు

అల్లిపురం : రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే మద్యం షాపులను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, దేవాలయాలు, మసీదులకు సమీపంలో అనుమతులు ఇవ్వొద్దని సోమవారం ఆయన డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు అన్వేషించకుండా మద్యం అమ్మకాలను ఆదాయ వనరుగా చూడడం సరికాదన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మద్యం షాపులు పెట్టొద్దని ఆందోళనలు చేస్తున్నారని, వాటిని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు.

అమర జవాన్లకు ఘన నివాళి



పోలీసు అమరవీరులను తలచుకుంటూ బ్యానర్ ప్రదర్శిస్తున్న గవర్నమెంట్ రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం బేరక్‌లో ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ కమిషనర్ ఏపీ దూబే, ఇతర సిబ్బంది కలిసి అమర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు.

- విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ప్లకార్డులు, బ్యానర్లతో నినాదాలు చేస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

కేవీలో సందడిగా శ్రేష్ఠ భారత్ ఉత్సవాలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శ్రీవిజయనగర్ కేంద్రియ విద్యాలయం-2 లో ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్ ఉత్సవాలు -2024ను సోమవారం ఘనంగా నిర్వహించారు. సీబీఎస్ఈ పాఠశాల పర్యవేక్షకుడు సి.వి నరసింహం, దూరదర్శన్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ షఫీ మహ్మద్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారి శక్తి సామర్థ్యాలను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో రాష్ట్రేతర స్థాయి నుంచి 8 క్లస్టర్లలో 72 పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఉపాధ్యాయులు బాలాజీ, రామ్‌భూపాల్, లక్ష్మిపాపాయి, రామచంద్రరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

దాబాగార్డెన్స్: విద్యార్థి దశలో తమలో దాగి ఉన్న ప్రతిభ వెలికితీయడంలో ఇటువంటి పోటీలు దోహదపడతాయని కంకటాల సీఎండీ కంకటాల మల్లికార్జునరావు, రోటరీక్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడు ధర్మేందర్, యూత్ సర్వీసెస్ డైరెక్టర్లు ఆశా జాస్తి, కరుణ పేర్కొన్నారు. రోటరీక్లబ్ వైజాగ్ కపుల్స్, సన్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్లో ప్రపంచ చెఫ్ దినోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు 'స్వచ్ఛమైన ఆహారం' పేరిట పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీలో విద్యార్థులు పాల్గొని ప్రతిభ పాటవాలు ప్రదర్శించిన తీరు ఆకట్టుకుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయడంలో వైజాగ్ కపుల్స్ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. పోటీలో గ్రీన్ డెల్ విద్యార్థిని అదిరిట గోగి ప్రథమ, నారాయణ పాఠశాలకు చెందిన అలోక్యనా ద్వితీయ, పి.హన్సిక తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ప్రత్యేక బహుమతిని ఇంటిల్ కె.రహినిక గెలుపొందింది. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైజాగ్ కపుల్స్ సభ్యులు కృష్ణారావు, జ్యోతి, శిల్పా, డాలీ, శేషుబాబు, చెఫ్‌లు సుధాకర్, జోగారావు పాల్గొన్నారు.



పోటీలో గెలుపొందిన విద్యార్థులతో ప్రముఖులు

భౌతిక శాస్త్రంతో ఉపాధి అవకాశాలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్ మంజుల అధ్యక్షతన విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ కె.హనుమంతరావుచే అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. భౌతికశాస్త్రం-పరిణామాలు అనే అంశంపై ఆయన సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చారు. భౌతికశాస్త్రం అధ్యయనం వల్ల సమాజంలో పెరిగిన సాంకేతికతను గూర్చి వివరించారు. సింగిల్ మేజర్ భౌతికశాస్త్రం చదవడం వల్ల, ఆ సబ్జెక్ట్‌లో పీజీ చేయడంతో అనేక ఉపాధి అవకాశాలున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం హనుమంతరావును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీఎల్ శరణ్య, అధ్యాపకులు డాక్టర్ బి. హైమావతి, డాక్టర్ ఎస్ కిరణ్మయి, కె.సత్య నాగవేణితో పాటు యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



విశ్రాంత ఆచార్యుడు హనుమంతరావును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గంటల వ్యవధిలోనే మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

అల్లిపురం: మిస్సింగ్ కేసు నమోదు చేసిన గంటల వ్యవధిలోనే ఛేదించి వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలిలా..మిరపకాయలవీధికి చెందిన నెల్లి లక్ష్మి (70) ఆదివారం ఉదయం తప్పిపోయింది. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అచ్చియ్యమ్మపేటలో ఒక ఇంటి అరుగుపై లక్ష్మి కూర్చునివుండగా నైట్ రౌండ్‌లో ఉన్న పోలీసులు చూశారు. ఆమెను ప్రశ్నించగా తప్పిపోయినట్టుగా చెప్పింది. దీంతో వృద్ధురాలిని అక్కడ నుంచి తీసుకువచ్చి మిరపకాయలవీధిలో ఉంటున్న కుటుంబ సభ్యులకు సీఐ బి.తిరుమలరావు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



తప్పిపోయిన లక్ష్మిని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న టూటౌన్ సీఐ తిరుమలరావు

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

జగదాంబ : ఎట్టకేలకు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించడంతో పాదచారులు నడవడానికి మార్గం లభించింది. జీవీఎంసీ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై 'నడిచే దారేదీ..?' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురించడంతో వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం స్పందించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. దీంతో నడవడానికి వెసులుబాటు కలిగిందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పూర్ణామార్కెట్ ఎదురుగా ఆక్రమణలు తొలగించిన తర్వాత ఫుట్‌పాత్

మునగతో ఆరోగ్య ప్రయోజనాలు

మహారాణిపేట : మనుషుల ఆరోగ్యానికి దోహదపడుతూ ఎన్నో పోషక విలువలు కలిగిన మునగ చెట్టు, ఆకుల ఆవశ్యకతను తెలుపుతూ ఐసీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం సంబంధిత పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీలేఖ, డీఈవో చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ జయదేవితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ జయదేవి మాట్లాడుతూ మునగ చెట్టు, ఆకుల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతున్నాయని పేర్కొన్నారు. ఐరన్, ప్రొటీన్, విటమిన్ ఏ, సీ, ఈ, విటమిన్ బీ1, బీ2, బీ3, బీ6 లభిస్తాయని తెలిపారు. వీటితోపాటు కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ లభిస్తాయని ఆమె వివరించారు.



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, తదితరులు

16, 17న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

అల్లిపురం : విశాఖ జిల్లా ఏఐఎస్ఎఫ్ 32వ మహాసభలు నవంబర్ 16, 17న నగరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి యు.నాగరాజు తెలిపారు. ఈ మేరకు అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో పి.శేఖర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహాసభల్లో జిల్లాలో గల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నూతన కార్యవర్గంతోపాటు జిల్లా సమితిని ఎన్నుకుంటామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లా సమితి సభ్యులు శివరాజ్‌కుమార్, శివరామరెడ్డి, సందీప్, కిరణ్, లవకుమార్, సూర్య గణేష్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు